

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"హే లేచావా?"** ఎవరో అడిగారు.

అటువైపుకి తిరిగి పడుకున్నాను.

"ఇంకాసేపు పడుకుంటావా?"

"ఊ" కొట్టాను.

"సరే. వన్ అవర్‌లో లేపనా?"

బదులివ్వలేదు.

"నిన్నే. వినిపిస్తుందా?"

విదిలించుకున్నాను.

"సారీ నిద్రపోతున్నావా?"

"సరే. బయట రూంలో ఉంటా."

రెండు సెకండ్ల తరవాత, "సరేనా?"

బదులివ్వలేదు.

"తలుపు ముయ్యనా?"

బదులివ్వలేదు.

"తెరుస్తాలే, గాలి వస్తుంది"

బదులివ్వలేదు.

"మూసాలే, సినిమా చూస్తా"

బదులివ్వలేదు.

"సౌండ్ డిస్టర్బ్ అవుతుందా?"

దిండు చెవులమీద కప్పాను.

"సారీ. నిన్ను చాలా డిస్టర్బ్ చేస్తున్నా."

ఛా. ఇంకేం పడుకుంటా అని లేచాను.

"లేచానులే"

"ఓ.. లేచావా? నేను ఇంకా నిద్రపోతున్నావనుకున్నా"

"ఫైవ్ సెకండ్స్ ముందు వరకు నిద్రపోతున్నా. ఇంక నిద్రపట్టదులే"

"ఓ. సో సారీ"

"ఇట్స్ ఓకే"

"నిజంగా సారీ, లేపాలనుకోలేదు."

"పర్లేదు"

"లేదు. నిజంగా సారీ. ఐ రియల్లీ సారీ"

"పర్లేదన్నానుగా. ఎందుకు పదిసార్లు చెప్తున్నావు?" విసుక్కున్నాను.

తలదించుకుని బయటకి వెళ్ళింది.

నేను కొద్దిసేపు కళ్ళు మూసుకున్నాను. కానీ తనని బాధపెట్టానని నాపై నాకే కోపం వచ్చింది. లేచి పళ్ళు తోముకుని తన దగ్గరకి వెళ్ళాను. ముందుగదిలో కూర్చుని ఏడుస్తూ కనిపించింది.

"హే, సారీ. కావాలని అలా అనలేదు. నాకు పొద్దున లేపితే కోపం. ఇక్కడ ఉన్నా అని మర్చిపోయాను. ఐ సో సారీ" బెదిరిపోయి అన్నాను.

"నువ్వు కాదు" ఏడవసాగింది.

"ఐ నో నేనే అని. రియల్లీ సారీ. ప్లీజ్ ఏడవకు"

"పర్లేదు, నాకు అలవాటే"

ఏడవకు అంటే `అలవాటేలే` లాంటి వేషాలు చూసి చిరాకు వేసినా "ప్లీజ్ అన్నాను కదా ఏడవకు" అన్నాను.

"నీవల్ల కాదు అవని."

"ఏమైంది? ఇంట్లో అంతా ఓకేనా?" ఎవరో చనిపోయారేమో అని భయపడ్డాను. అనవసరంగా లేవలేదు. ముందే లేస్తే ఈ గోల ఉండేది కాదు. మెలుకువ వచ్చిన వెంటనే గుడ్ మార్నింగ్ చెప్పాల్సింది అని నన్ను నేను తిట్టుకుంటుండగా,

"ఇంట్లో ఓకే. అంతా నేనే చేతులారా చేసుకున్నాను. అందరి మాట వింటే బానే ఉండేది" వెక్కి వెక్కి ఏడ్చింది.

"అయ్యో, ఏమైంది. అంత బానే జరుగుతుందిలే. డోన్ట్ వర్రీ" తన భుజం తడిమాను. నాలా ఇంకెంత మంది తిట్టారో పాపం అనుకున్నాను.

"పర్లే దు. ఐల్ బీ ఫైన్. నువ్వు నీ పని చేసుకో"

"వెళ్ళిపోనా?" బెదిరిపోయాను.

"లేదు"

"ఏమైనా చెయ్యనా?"

"నాకు ఎక్కడైనా సైలెంట్‌గా ఉండే చోటుకి వెళ్ళాలని ఉంది"

"లైబ్రరీ?" సలహా ఇచ్చాను.

గుడ్ ఐడియా. కానీ మన దేశీవాళ్ళు నన్ను ఇలా చూడ్డం నాకు ఇష్టంలేదు."

"పబ్లిక్ లైబ్రెరీ?"

"నాకు మెంబర్ షిప్ లేదు."

"మెంబర్ షిప్ అక్కరలేదు లోపలికి వెళ్ళడానికి"

"ఔనా?"

"నిజం"

"నీకెలా తెలుసు?"

"మా అన్నయ్యతో వెళ్ళాను"

"ఇక్కడ సేం రూల్స్ వుంటాయా?"

"యా. అన్ని లైబ్రెరీలు ఒకటేలా ఉంటాయి అన్నయ్య చెప్పాడు."

"పద అయితే" కీస్ తీసుకుని తలుపు తెరిచింది.

"డ్రస్ చేంజ్ చేసుకుని వస్తా."

"అక్కర్లే" తలుపు బయటకి నడిచింది.

చెప్పులు వేసుకుని జాలిపడుతూ తన వెంట నడిచాను. కారులో అంతా నిశ్శబ్దంగా ఉంది. పది నిమిషాల్ అతరువాత లైబ్రెరీలో ఉన్నాము. పుస్తకాలు వాతావరనం చూసి అన్నయ్య గుర్తొచ్చాడు. ఏడుపు వచ్చినా దిగమింగాను. ఇప్పుడు నేను దిగులు పడడం కన్నా హనీషకి తోడుండడం ఎంతో అవసరం.

"నువ్వు బుక్స్ చూడు. నేను ఆ మూల కూర్చుంటా" హనీష వెళ్ళిపోయింది.

కాస్త ఇబ్బందిగా అటూ ఇటూ చూసాను. అంతమంది జనాలు లేరు. నికొలస్ స్పార్క్, సిడ్నీ షెల్డన్ పుస్తకాలు ఉన్నాయా అని వెతికాను. పది పుస్తకాలు చూస్తే ఒక్క పేరూ తెలిసిన రచయితది కాదు. నాలుగైదు షెల్ఫ్‌లకి అవతల హనీష కూర్చుని కళ్ళు మూసుకుంది. నేను నికొలస్ స్పార్క్స్ పుస్తకం కనిపించిన మొదటిది చేతిలోకి తీసుకున్నాను. లైబ్రెరీ మెంబర్ షిప్ ఎలా తీసుకోవాలా అని అన్నయ్యని అడుగుదామంటే ఫోన్ తేవడం మర్చిపోయాను. నన్ను నేను తిట్టుకుంటూ

హనీష టేబుల్ కాక మరో చోట కూర్చున్నాను. రెండు పేజీలు చదివాక, ఎలా అయినా అవసరం కదా అని మెంబర్ షిప్ ఎలా తీసుకోవాలో కనుక్కోడానికి వెళ్ళాను. ఐడీ ఒక్కటి చాలని చెప్పారు.

"ఐ ఫర్గాట్ టు బ్రింగ్" బదులిచ్చాను.

"వీ ఆక్సెప్ట్ డిజిటల్ కాపీ" అన్నారు.

"ఐ ఫర్గాట్ మై ఫోన్ ఆల్సో" అన్నాను.

అమ్మాయి నన్ను పై నుంచి కిందవరకు చూసింది. తన పక్కన ఉన్న అబ్బాయి, "యూ కెన్ యూజ్ లైబ్రెరీ కంప్యూటర్. ఇఫ్ యు హేవ్ ఇట్ ఇన్ యువర్ ఈ మెయిల్, ఐ కెన్ హెల్ప్ యు ప్రింట్" అన్నాడు.

"యెస్. ఐహేవ్ ఎ స్కేన్ కాపీ" అని కంప్యూటర్లు ఉన్న వైపుకి వెళ్ళాను. విచిత్రంగా ఈ కంప్యూటర్లకి పాస్ వర్డ్ లేదు. జి మెయిల్‌లోకి లాగిన్ అయ్యి అన్నయ్యకి పంపిన నా పాస్‌పోర్ట్ స్కాన్డ్ కాపీ ఉన్న ఈ మెయిల్ తెరిచి పక్కకి చూసాను. ఆ అబ్బాయి వచ్చి దాన్ని ప్రింట్ చేసి నడుస్తూ వెళ్ళాడు. నా పాస్ పోర్ట్ వివరాలు కాజేస్తాడేమో అని భయపడి గబుక్కున లాగ్ అవుట్ అయ్యి తన వెంట దాదాపు పరిగెత్తాను. నా వివరాలని బట్టీ పడుతున్నట్టు ఆ పేపర్ కేసి చూడసాగాడు. కంప్యూటర్‌లో టైప్ చేసి ఏదో చూసాడు. ఆ తరవాత కాగితం మీద నా వివరాలు రాసి "అడ్రెస్ ప్రూఫ్?" అడిగాడు.

"ఐ డోన్ట్ హేవ్" అన్నాను.

బెదిరిపోయి చూసాడు.

"షీ ఈజ్ న్యూ. యూజ్  మైన్. ఐ డోన్ట్ హేవ్ మెంబర్ షిప్. హౌ మచ్ ఈజ్ ఇట్?"

హనీష గొంతు వినబడింది.

హనీష ఐడీ తీసుకుని ఫటఫటా ఒక కార్డు ప్రింట్ చేసి, "పబ్లిక్ లైబ్రెరీ ఈజ్ ఫ్రీ" తన చేతికి ఇస్తూ చెప్పాడు.

"రియల్లీ? దట్స్ వెరీ నైస్" హనీష ఆశ్చర్యం స్పష్టంగా తెలిసింది. నా చేతిలో ఉన్న రెండు పుస్తకాలు చెక్ అవుట్ చేసి "కెన్ ఐ హేవ్ మై పాస్ పోర్ట్ పేపర్స్" అని తన నుండి ఆ కాగితాలు తీసుకున్నాను.

బయటకి నడుస్తూ "థాంక్స్ హనీష" అని ఆ కాగితాలవైపు చూసి పెద్దగా నవ్వాను. హనీష బెదిరిపోయింది. చుట్టుపక్కల వాళ్ళు ఆగి నావైపు కొన్ని సెకండ్లు చూసి వెళ్ళిపోయారు.

"ఏమైంది?" బిత్తరపోయి అడిగింది.

"నా పేరు బదులు అప్లికేషన్ ఫార్మ్‌లో మా నాన్న పేరు రాసాడు" హనీషకి చూపించాను. ఇద్దరం కలిసి నవ్వాం.

"ఒక ఫోటో తీస్తాను" నవ్వు ఆపుకుని కాస్త దూరం నడిచి నా ఫోటో తీసింది.

"ఎందుకు తీసావు?" అడిగాను.

"ఆ లైబ్రెరీలో వాళ్ళిద్దరు నువు ఏ హోంలెస్సో అనుకుని ఉంటారు. అందుకే ఆ అమ్మాయి భయపడితే ఆ అబ్బాయి ప్రింట్ అవుట్‌కి డబ్బులు కట్టాడు."

ఆశ్చర్యపోయి "నువ్వు అన్నీ చూసావా? ఏడవలేదా?" గబుక్కున అడిగేసాను.

"నేనేమీ ఏడుపుగొట్టుదాన్ని కాదులే. నీ వల్లే కాస్త నయమయ్యాను. థ్యాంక్స్"

"ఇంతకీ ఏమైంది అసలు? ఇంట్లో అందరూ బానే ఉన్నారా?"

"యా..యా. ఇంట్లో అంతా ఓకేనేలే ఇప్పుడు"

"థాంక్స్, వాళ్ళు హోంలెస్ అని పోలీసులని పిలుద్దామనుకున్నారేమో. టైంకి వచ్చావు" తన ఇబ్బంది గమనించి టాపిక్ మార్చాను.

చిన్నగా నవ్వుతూ "చూడు" తన ఫోన్‌లో తీసిన ఫోటో నా చేతికిచ్చింది.

చెదిరిపోయిన జుట్టు, మరకలున్న యెల్లో షర్ట్, మేచింగ్ లేని బ్లూ పేంట్, నిద్రమొహం పులిబోనులో ఇరుక్కున్న జింకలాంటి కళ్ళు. నేనేనా అని ఎంతో ఆశ్చర్యపోయాను. పైకి నవ్వినా, లోపల మాత్రం ఇలా మళ్ళీ ఎప్పుడూ జరగకూడదని నిశ్చయించుకుని కారెక్కాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story